www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 172 | హైదరాబాద్ | మంగళవారం | 14-10-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ



హైదరాబాద్, సిద్దిపేట పవర్ :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తోందా?మజ్లిస్ పోటీ చేస్తోందా? అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.

''కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వ నగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది. జూబ్లీహిల్స్ ప్రజలు భాజపాను ఆదరించాలి. నియోజకవర్గంలోని మేధావులు, సినీ ప్రముఖులు మా పార్టీకి ఓటు వేస్తారని ఆశిస్తున్నాం. ఇవాళ రాత్రి లేదా రేపు అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది'' అని ఆయన తెలిపారు.

## ఆర్టీసీ మహాలక్ష్మికి బాకీ

# 1350 కోట్లు!

నెలకు రూ.10 కోట్లు ఎగ్గొడుతున్న రేవంత్ సర్కారు

రూ.700 కోట్లకుపైగానే బస్‌పాస్‌ల పెండింగ్‌లు

రూ.300 కోట్లు ఇస్తేనే ఆర్టీసీ వేతనాలు చెల్లించే పరిస్థితి

రూ.500 కోట్లు చెల్లించాలని బీఆర్ఎస్ డిమాండ్

ఆర్టీసీకి నిధుల మంజూరులో కాంగ్రెస్ సర్కారు అలసత్వం




తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

ఆర్టీసీకి 'మహాలక్ష్మి పథకం.. ఉచిత బస్సు ప్రయాణం' నిధులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వంతో భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయి. వేల కోట్ల రూపాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నా.. ప్రజా రవాణాను నిర్లక్ష్యం చేస్తుండటంతో సంస్థ ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేని పరిస్థితికి చేరుకుంది. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి ఒక్క మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన బకాయిలే సుమారు రూ.1350 కోట్లు ఉన్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన నాటి నుంచి ప్రతినెలా ఎంతోకొంత (కనీసం రూ.10కోట్లు) డబ్బులు పెండింగ్ పెడుతుండటంతో ఇవ్వాల్సిన డబ్బులు భారీగా పేరుకుపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కింద నెలకు సుమారు రూ.310 కోట్లరూ.350 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల ఆర్టీసీ సమస్యలపై గళమెత్తిన బీఆర్ఎస్ నేతలు ప్రజారవాణా సంస్థను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన బకాయిలతోపాటు, ప్రభుత్వం తరపున ..మిగతా 2లో



## సంక్షేమ హాస్టళ్లకు

# రూ.60 కోట్లు..

భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులకు కేటాయింపు

విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్

వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం.. విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...

సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు




తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

బీసీ, ఎస్సీ , ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది.

హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు ..మిగతా 2లో



### వెనుకబడిన వర్గాల కోసం టీజీఐఎల్పీ

సెర్ప్ సహకారంతో స్వయం ఆదాయం పొందేలా చర్యలు

ఇప్పటివరకు 3,554 కుటుంబాల గుర్తింపు

టీజీఐఎల్పీ అమలుపై మంత్రి సీతక్కతో భేటీ అయిన బ్రాక్ ప్రతినిధుల బృందం

02



### తగ్గిన సీజనల్ వ్యాధులు

గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు

సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

## చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం

ఖైదీలకు బీమా, కుటుంబ సభ్యులకు వడ్డీలేని రుణ సదుపాయం కల్పించడం అభినందనీయం

జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ భేష్

కస్టడీ-కేర్-కరక్షన్ కు ఆచరణ రూపమిస్తున్న జైళ్ల శాఖ

ఖైదీల ఉత్పత్తులతో ప్రత్యేక మేళా నిర్వహించండి : బండి సంజయ్



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ స ..మిగతా 2లో

## మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశం

మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశమన్న టీపీసీసీ చీఫ్

ఇది తమ కుటుంబ సమస్య, పరిష్కరించుకుంటామని వ్యాఖ్య

సమాచార లోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తాయన్న మహేశ్ కుమార్



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణ రాష్ట్రంలో మంత్రుల మధ్య తలెత్తిన వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఇది చాలా చిన్న అంశమని, తమ కుటుంబ సమస్య అని, దీనిని తామే పరిష్కరించుకుంటామని ..మిగతా 2లో

## కారు, బుల్డోజర్ మధ్య మొదలైన యుద్ధం..

రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోంది..!

కాంగ్రెస్ గురించి తెలిసే గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఆ పార్టీని గెలిపించలేదన్న కేటీఆర్

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్య

అజారుద్దీన్‌కు ఇచ్చిన ఎమ్మెల్సీ కోర్టులో నిలబడదన్న కేటీఆర్



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ ..మిగతా 2లో

## సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి

# రూ.251 కోట్లు

ఈసారి కోటిమందికి పైగా భక్తులు వస్తారని అంచనా

నాపై మంత్రులు ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు

ఆ వార్తలను నమ్మడం లేదు

నేనేంటో అందరికీ తెలుసు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

అశేష భక్తుల కొంగుబంగారం సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం 251 కోట్ల రూపాయిలు ఖర్చు చేయనున్నట్లు వరంగల్ ఇన్ ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి, ..మిగతా 2లో

# తగ్గిన సీజనల్ వ్యాధులు

- **గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు**
- **సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

**హైదరాబాద్, సిద్దిపేట పవర్ :**

రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖాన్ల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేండ్లతో పోల్చితే, ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు గణనీయంగా తగ్గాయని హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు.గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ చికున్‌గున్యా కేసులు 361 నమోదవగా, ఈ ఏడాది జనవర్ నుంచి సెప్టెంబర్ వరకూ 249 కేసులు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. ఇదే సమయంలో గతేడాది 226 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది 209 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. గతేడాది టైఫాయిడ్ కేసులు 10,149 నమోదవగా, ఈ ఏడాది 4600 మాత్రమే నమోదయ్యాయని అధికారులు వివరించారు. గతేడాదితో పోలిస్తే డెంగీ కేసులు 2900 తక్కువగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు.
ఈ మేరకు అధికారులు మంత్రికి నివేదిక అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండడం భినందనీయమన్నారు.
మొత్తంగా చూసినప్పుడు కేసులు తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్, మరో నాలుగైదు జిల్లాల్లో స్వల్పంగా కేసులు పెరిగాయని, ఆయా జిల్లాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు.ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, ఆయా జిల్లాల్లోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆ మార్పుల వల్ల ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాలు పడుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు.ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టే, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలను ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు.
ఒకవేళ సీజనల్ వ్యాధుల బారినపడితే, ప్రభుత్వ దవాఖాన్ల వైద్య సేవలను ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ప్రభుత్వ దవాఖాన్లలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



# సంక్షేమ హాస్టళ్లకు రూ.60 కోట్లు..

**మొదటిపేజీ తరువాయి**

తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు.
హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్మాణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్



మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి , బి. షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల కోసం టీజీఐఎల్పీ

- **సెర్ప్ సహకారంతో స్వయం ఆదాయం పొందేలా చర్యలు**
- **ఇప్పటివరకు 3,554 కుటుంబాల గుర్తింపు**
- **టీజీఏఎల్పీ అమలుపై మంత్రి సీతక్కతో భేటీ అయిన బ్రాక్ ప్రతినిధుల బృందం**

**హైదరాబాద్, సిద్దిపేట పవర్ :**

రాష్ట్రంలోని అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఇన్క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ) అమలుపై చర్చించేందుకు సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో బ్రాక్ (బీఆర్ఏసీ) ప్రతినిధుల బృందం భేటీ అయింది. సెర్ప్ సహకారంతో ఆదివాసీలు, జోగినీలు, ఇతర పేద కుటుంబాల ఆర్థిక సాధికారత కోసం బ్రాక్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఎంపిక చేసిన పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహకాలు, లోన్లు, రాయితీలు అందించి, వాటిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చడమే తెలంగాణ సమ్మిళిత జీవనోపాది కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది

**3,554 కుటుంబాల గుర్తింపు, శిక్షణ**

టీజీఐఎల్పీ అమలు తీరుపై బ్రాక్ ప్రతినిధులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఇప్పటివరకు మొత్తం 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన మండల మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి లబ్ధిదారులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా పేద కుటుంబాలకు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే మార్గాలు కల్పించి, వారిని ఆర్థికంగా స్వావలంబన కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు బ్రాక్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. మంత్రి సీతక్కతో భేటీ అయిన వారిలో గ్రెగరీ చెన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్వేతా బెనర్జీ (ఇండియా లీడ్), ఉషా రాణి (ప్రోగ్రాం లీడ్), వి. రమేష్ (సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్), అభిషేక్ (ప్రోగ్రాం అసోసియేట్) తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ కూడా పాల్గొన్నారు.



# కారు, బుల్డోజర్ మధ్య మొదలైన యుద్ధం

**మొదటిపేజీ తరువాయి**



పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

# సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి రూ.251 కోట్లు



**మొదటిపేజీ తరువాయి**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అధికారులతో కలిసి ఆలయ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా 101 కోట్ల రూపాయిలు మంజూరు చేయగా వీటిలో 71 కోట్ల రూపాయిలకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. గతంలో మంజూరైన 150 కోట్ల రూపాయిలతో కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేడారం జాతరకు వచ్చే నిధులు జంపన్న వాగులో వరదలాగ జారిపోకుండా గిరిజన, గిరిజనేతరుల ఆరాధ్యదైవాల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, దీనిలో భాగంగా రోడ్లు ఇతర నిర్మాణాలు సాగిస్తామని చెప్పారు. మరో 50 రోజుల్లో ఈ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఒక క్రమపద్ధతిలో సాగేలా కలెక్టర్, ఎస్పీలకు సూచనలు ఇచ్చామన్నారు. ఆలయాభివృద్ధికి ఎవరు ఎటువంటి సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని, ఈ పనులను మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తారని అన్నారు. గతంలో ఈ జాతరకు కోటి మందికి పైగా వచ్చినట్లు అధికారులు చెప్పారని ఈ సారి ప్రభుత్వ అభివృద్ధి చర్యల కారణంగా ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు స్పందిస్తూ "నేనేంటో అందరికీ తెలుసు, 70 కోట్ల కాంట్రాక్ట్ వర్క్‌కు తాపత్రయపడే అవసరం నాకు లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మడం లేదు. ఫిర్యాదు చేయడానికి ఏమంది అధిష్ఠానానికి ఎవరూ ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు. నేను కూడా అలా జరుగుతుందని నమ్మడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నాం. సమ్మక్క సారలమ్మల వంటి సీతక్క, సురేఖ అక్కలతో ఈ కార్యక్రమాలకు హాజరవుతాను"అని మంత్రి పొంగులేటి చెప్పారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ మహాలక్ష్మికి బాకీ 1350 కోట్లు!

**మొదటిపేజీ తరువాయి**

ఆర్టీసీ ఇస్తున్న రాయితీలు మొత్తం కలిపి నెలకు కనీసం రూ.500 కోట్లు ఇవ్వాలని కోరారు.

**80శాతం ఉచిత ప్రయాణాలే!**

ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలో ఒక్కో బస్సులో సుమారు 80శాతం వరకు ఉచిత ప్రయాణాల టిక్కెట్లే ఉంటున్నాయని కండక్టర్లు చెప్తున్నారు. 20శాతం మాత్రమే ప్రయాణిస్తున్న పురుషుల టికెట్ల ద్వారా డబ్బులు వస్తున్నాయని అంటున్నారు. దీంతో ఆర్టీసీకి రోజూ ప్రత్యక్షంగా వచ్చే నగదు భారీగా తగ్గిపోయిందని వాపోతున్నారు. జీరో టికెట్లకు లెక్కకట్టి ప్రతినెలా నిధులు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ దాటవేస్తున్నది. దీంతో ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు ప్రతినెలా 20వ తేదీ నుంచే సచివాలయంలోని ఉన్నతాధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్తున్నారు. 10రోజులు ముందు నుంచి చెప్తేగానీ ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని వివరిస్తున్నారు. ఇవ్వాల్సిన డబ్బుల్లోనూ ప్రభుత్వం కోత విధిస్తుండటంతో ఆ లోటును పూడ్చలేక సతమతవుతున్నామని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. మహిళా ప్రయాణికులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రీయింబర్స్ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నాయి. జీరో టిక్కెట్ ఎర్నింగ్స్‌ను కూడా చార్జీ టికెట్ ఎర్నింగ్స్ కింద పరిగణించాలని సూచిస్తున్నారు. చార్జీతో కూడిన టికెట్ ఎర్నింగ్స్ పెంచాలని కండక్టర్లపై, కేఎంపీఎల్ పెంచాలని డ్రైవర్లపై వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇతర రాయితీల బాకీ రూ.700 కోట్లు**

వివిధ వర్గాలకు ఇస్తున్న బస్‌పాస్ రాయితీల డబ్బులు ప్రభుత్వం వందల కోట్లలో ఆర్టీసీకి



చెల్లించాల్సి ఉంది. 25 లక్షల మంది విద్యార్థులు, జర్నలిస్టులు, దివ్యాంగులు, ఇతరులు కలిపి మొత్తం 31 లక్షల మందికి ఇస్తున్న బస్‌పాస్ రాయితీలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. కాగా ఈ బాకీ మొత్తం సుమారు రూ.700 కోట్లు వరకు ఉంటుందని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. వాటిని ప్రభుత్వం నుంచి రాబట్టే విషయంలో యాజమాన్యం కూడా మెతక ధోరణి అవలంబిస్తున్నదని ఆర్టీసీ యూనియన్ల నేతలు అంటున్నారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు పెంచడం లేదని, కొత్త బస్సుల కొనుగోలులో తాత్సారం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఆర్టీసీ విస్తరణ కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం.. సంస్థ ఆస్తులను, డిపోలను, వర్క్‌షాపులను, కార్గో వ్యవస్థను వరుసగా ప్రైవేట్ పరం చేస్తుండం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేట్ అక్రమ వాహనాలను కట్టడి చేయాలని, ఆర్టీఏ అధికారులు రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆర్టీసీ యూనియన్ల నేతలు కోరుతున్నారు.

# చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం.

**మొదటిపేజీ తరువాయి**

రుణ సదుపాయం కల్పించడం అభిందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా ఉండలేమన్నారు. కస్టడీకేర్‌కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు.
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్నఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూల వనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు.
అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. 25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ. 11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.
సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతోపాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఖైదీలకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్ఠాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజే విజన్ అద్భుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో 'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశం

**మొదటిపేజీ తరువాయి**



ఆయన అన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన పరామర్శించారు. ఇటీవల ఖర్గేకు పేస్‌మేకర్ అమర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఖర్గేను కలిశారు.
అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సమాచార లోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడం సహా ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను ఖర్గేకు వివరించినట్లు మీడియాకు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని స్పష్టం చేశారు.

# దుబ్బాక బస్సు డిపోకు కొత్త బస్సులు కావాలి

- **ప్రతి పల్లెకు పల్లె వెలుగు రావాలి**
- **ప్రజలంతా సుఖ సంతోషాలతో ఎదగాలి**
- **దుబ్బాక బస్ డిపో పునరుద్ధరణకు ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి.**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ అక్టోబర్ 13 ప్రతినిధి**

ఈరోజు బస్సు భవన్ లో టి.జి.ఎస్.ఆర్.టి.సి ఛైర్మన్ యండి నాగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, దుబ్బాక బస్ డిపోను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ — 1996 సెప్టెంబర్ 9న ప్రజల విరాళాలతో సుమారు 5 ఎకరాల స్థలాన్ని బస్ డిపో కోసం కేటాయించగా, 1998 ఆగస్టు 26న 54 బస్సులతో డిపో ప్రారంభమైందని తెలిపారు. ప్రారంభం నుండి దుబ్బాక డిపో అత్యుత్తమ సేవలు అందిస్తూ, 137 మంది సిబ్బంది ప్రతిరోజు 14,014 కి.మీ. ప్రయాణం చేసి, రూ.8 లక్షల దినసరి ఆదాయం సాధిస్తున్నారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ నష్టాల కారణంగా 2006 డిసెంబర్ 31న డిపో మూసివేయబడినప్పటికీ, ప్రజలు మరియు ప్రజాప్రతినిధుల నిరసనలతో వారం రోజుల్లోనే 10 బస్సులతో పునఃప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య 35కి పెరిగి, రాష్ట్రస్థాయిలో ఆదాయ పరంగా ముందున్న డిపోలలో దుబ్బాక డిపో ఒకటిగా నిలుస్తోందని, ఇటీవల 2025 రాఖీపూర్ణిమ సందర్భంగా రాష్ట్రంలో 8వ స్థానం, ఉమ్మడి జిల్లాలో 2వ స్థానం సాధించిందని చెప్పారు. దుబ్బాక డిపో నుంచి నిజామాబాద్, శ్రీశైలం, కరీంనగర్, వేములవాడ, ముస్తాబాద్, రామాయంపేట, దౌల్తాబాద్, చేగుంట, దొమ్మాట, యాదగిరిగుట్ట వంటి రూట్లలో కొత్త సర్వీసులు ప్రారంభించాల్సిందిగా ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు. అలాగే, దుబ్బాక బస్ డిపోకు కొత్త డిపో మేనేజర్‌ను నియమించి, 60 బస్సులతో పూర్తిస్థాయి పునరుద్ధరణ చేపట్టాలని ఎండీ నాగిరెడ్డి కోరారు.



# ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సందర్శించిన అస్కి బృందం సభ్యులు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సోమవారం అస్కి బృందం డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రభుత్వ జిల్లా దావాఖానాను పరిశీలించారు.అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ అస్కి వైద్యబృందం దావఖనలోని పలు విభాగాలలో రోగులకు అందుతున్న సేవలను క్షుణంగా పరిశీలించి, కేంద్రీకృత ల్యాబ్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అస్కి బృందానికి సూపరిడెంట్ డాక్టర్ అన్నపూర్ణ స్వాగతం పలికి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాము, నర్సింగ్ సూపరింటెంట్, నర్సింగ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



# హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి**

**చేర్యాల, అక్టోబర్ 13 (సిద్దిపేట పవర్)**

దేశంలో,రాష్ట్రంలో దిన దినం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల కనుగుణంగా హమాలీ కార్మికుల వేతనాలు, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తాడు మామూళ్లను పెంచాలని, హమాలీ కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. చేర్యాల మండల సిఐటియు హమాలి కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం రేపాక కుమార్ అధ్యక్షతన స్థానిక వైశ్య భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కాముని గోపాలస్వామి హాజరై మాట్లాడుతూ నేడు దేశ సంపదను సృష్టించడంలోను, ప్రజల అన్ని అవసరాలకు సంబంధించిన వస్తువులను ఎగుమతి, దిగుమతి చేసే పనుల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ గుర్తింపు లేక ప్రభుత్వం వీరిని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని అన్నారు. అనంతరం చేర్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు కార్యాలయానికి వెళ్ళి కలిసి బస్తాలు, తాడు మామూళ్లు పెంచాలని,మెమోరండం సమర్పించడం జరిగింది. రాబోయే రోజుల్లో హమాలీ కార్మికులు ఐక్యతతో సంఘటితమై తమ సమస్యల పరిష్కారానికి సిఐటియు నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సమావేశం లో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి,రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో, ప్రజా సంఘాల నాయకులు బండకింది అరుణ్, సిఐటియు హమాలీ కార్మిక సంఘం మండల నాయకులు దప్పు కిషన్, ఎలుగు రవి, పిట్టల యాదయ్య, శ్రీరాముల మహిపాల్,సింగపాక బాలయ్య, గర్ల పెల్లి నరసింహులు, చెరువు సాయిలు, మేడిచెల్మి పరుశరాములు, ఏంటే నరసయ్య, గుజ్జుల కృష్ణారెడ్డి, అని ఆవుల కృష్ణమూర్తి, దేవులపల్లి రమేష్ ,నూకల శ్రీనివాస్, ఒగ్గు రాములు, ఏదుల చందు, బైర లింగం, వివిధ గ్రామాల హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# వివాదాల్లో చిక్కుకుంటున్న మంత్రులు.. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

**హైదరాబాద్, సిద్దిపేట పవర్ :**

ప్రభుత్వం చేసే పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. తనకు, సర్కారుకు మంచి పేరు తీసుకురావాలి. పార్టీకి, సీఎంకు సైతం ప్రతిష్టను పెంచాలి. మంత్రులకు ఉండే బాధ్యతల్లో ఇవి చాలా కీలకం. కానీ, కొందరు మాత్రం వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నారు. ఒకరి శాఖ విషయంలో మరొకరు జోక్యం చేసుకోవడం, ఒకరికి తెలియకుండానే మరొకరు రివ్యూలు నిర్వహించడం, టెండర్లు పిలవడం, ఏకంగా ప్రెస్ మీట్లలోనే ఒక మంత్రిపై మరో మంత్రి కామెంట్లు చేయడం చేస్తున్నారు. డైలీ సీరియల్ మాదిరి జరుగుతున్న మంత్రుల వ్యవహారాలన్నీ సీఎం దగ్గరకు వెళ్లడం, ఆయన పరిష్కారం చూపడం జరుగుతున్నదని తెలిసింది.

**మంత్రుల మధ్య సమన్వయ లోపం!**

రాష్ట్ర మంత్రుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. తరచూ జరుగుతున్న ఘటనలే అందుకు నిదర్శనం. దీనివల్ల కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నట్లు కాంగ్రెస్ నేతలే అభిప్రాయపడుతున్నారు. ఒక శాఖకు చెందిన ఉన్నతాధికారులతో మరో మంత్రి వివేక్ సమీక్ష చేయడం తీవ్ర చర్చకు దారి తీసింది. దీంతో ఆ శాఖ మంత్రి కొండా సురేఖ సీరియస్ కాగా, సమీక్ష చేసిన మంత్రి సారీ చెప్పినట్లు సమాచారం. దీంతో సమీక్షలంటేనే అధికారులు సైతం హడలిపోతున్నట్లు తెలిసింది. మేడారం జాతరపై ఆ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి రివ్యూ చేయడం, దీనికి సీతక్క , సురేఖ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

ఆ తర్వాత ఆ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల మధ్య పొసగడం లేదని, అందుకే జాతర పోస్టర్ ఆవిష్కరణలో ఒక మంత్రి పాల్గొనలేదని, రివ్యూలో సైతం పాల్గొనలేదని ప్రచారం జరిగింది. తర్వాత ఇద్దరు మంత్రులు తమ మధ్య విభేదాలు లేవని మీడియా ముఖంగా సంజాయిషీ ఇచ్చారు. రెండు రోజుల క్రితం జాతర టెండర్ల విషయంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లా మంత్రికి మధ్య పంచాయితీ నడిచింది. ఇన్‌ఛార్జ్ మంత్రి తన అనుచరులకే కాంట్రాక్ట్ అప్పగించారని పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారని సమాచారం. తాజాగా మరో మంత్రి కూడా ఇన్‌ఛార్జ్ మంత్రి తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తమ ఇంటి సమస్యను తామే పరిష్కరించుకుంటామని పీసీసీ చీఫ్ సైతం స్పష్టం చేశారు. తానెవ్వరి మీద ఫిర్యాదు చేయలేదని మంత్రి సీతక్క ట్వీట్ చేయడం, తనపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని, తనను పార్టీలో ఎవరూ ఏమీ అనలేదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. తనపై వస్తున్నవార్తల్లో నిజం లేదని వెల్లడించారు.

**రచ్చకు దారి తీసిన పొన్నం వ్యాఖ్యలు**

ఈ మధ్య మంత్రి పొన్నం ప్రభాకర్చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో కొంత గందరగోళానికి దారితీశాయి. మంత్రి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో స్పందించారు. దీంతో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించింది. అయితే, మంత్రి వివేక్ ఇదే ఇష్యూపై తాజాగా మాలల ఐక్యతా సదస్సులో స్పందిస్తూ, తనపై కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కొందరు రెచ్చగొడుతున్నారని అన్నారు. మంత్రి పదవిపై తనకు వ్యామోహం లేదని, సేవ చేయడమే లక్ష్యమని వివేక్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలకు వెంటనే లక్ష్మణ్ స్పందించారు. ముగిసిన వివాదాన్ని వివేక్ మళ్లీ తెరపైకి తెస్తున్నారని అన్నారు. ఈ అంశాన్ని అధిష్టానం చూసుకుంటుందని, తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

అంతకుముందు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి మధ్య గ్యాప్ వచ్చిందనే ప్రచారం జరిగింది. జూలై 29న సాగర్ పర్యటన నేపథ్యంలో మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఇద్దరు ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకోగా మంత్రి ఉత్తమ్ సమయానికి రాలేదు. దీంతో అసహనం వ్యక్తం చేసి కోమటిరెడ్డి రిటన్ వెళ్లిపోయారు. ఉత్తమ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం కోమటి రెడ్డి ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ ఝా కు



ఆర్ అండ్ బీ శాఖలో పోస్టింగ్ ఇవ్వొద్దని సీఎంకు లేఖ రాశారనే ప్రచారం ఉన్నది. మరోవైపు, జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రులుగా ఉన్నవారికి, ఆ జిల్లా మంత్రులకు పలు అంశాల్లో తరచూ అభిప్రాయ విభేదాలు వస్తుండడం, ఒకరి రివ్యూకు మరొకరు హాజరు కాకపోవడంతో ఇవన్నీ చర్చనీయాంశాలుగా మారాయి. జిల్లాల్లో అభివృద్ధి పనులు సైతం కుంటుపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇస్తున్నారా?**

సమన్వయ లోపంతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినా మంత్రులు స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏ శాఖపై విమర్శలు వస్తే ఆ శాఖ మంత్రి మాత్రమే స్పందిస్తుండడం, మిగిలిన వారు తమకేంటి, స్పందించాల్సిన అవసరం లేదు, తమ శాఖ కాదు కదా, అలాంటప్పుడు ఎందుకు స్పందించాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. అలా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో మంత్రులు విఫలమవుతున్నారనేది స్పష్టమవుతున్నది. రుణమాఫీ విషయంలో, ఉద్యోగాల కల్పన విషయంలో, ఆ మధ్య యూరియా అంశంలో, గ్రూప్ 1 విషయంలోనూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేసినా ఆశించిన స్థాయిలో మంత్రులు స్పందించ లేదని కాంగ్రెస్ నేతలే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి విషయానికి సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తే తప్ప సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. మంత్రుల మధ్య విభేదాల పరిష్కారం సీఎం జోక్యంతో జరుగుతున్నట్టు సమాచారం. ఏ మంత్రి అయినా క్యాబినెట్‌లో ఉన్నప్పుడు విమర్శలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ, ఆ దిశగా కొందరు మంత్రులు స్పందించకపోవడం శోచనీయం. ఫలితంగా ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇస్తున్నట్టు అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

**శాఖలపై పట్టు ఏది?**

మరోవైపు, మంత్రులు శాఖలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. మంత్రులు పంపిన ఫైల్స్‌ను అధికారులు పక్కకు పెడుతున్నారని , కొన్నింటిని రిజెక్ట్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. అధికారులకు నచ్చితే తప్ప ఆ ఫైల్స్ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు శాఖకు సంబంధించిన సమాచారం అడిగినా ఉన్నతాధికారులు ఇవ్వడం లేదనే ప్రచారం జరుగుతున్నది. దీనికి కారణం సంబంధిత శాఖ మంత్రికి ఆ శాఖపై పట్టు లేకపోవడమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మంత్రులు వివాదాలకు వెళ్లకుండా వారికి కేటాయించిన శాఖలపై దృష్టి సారిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆ దిశగా దృష్టి పెడతారా? లేకుంటే వివాదాలకు కేరాఫ్‌గా మారుతారా అనేది చూద్దాం.

# గాంధీ ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

**సికింద్రాబాద్, అక్టోబర్ 13 ( సిద్దిపేట పవర్ ):**

గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..యాప్రల్ జెజె నగర్‌కు చెందిన పి. రితు (38) తన సోదరుడు ఎస్. శోభన్ (37) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.శోభన్ కేటరింగ్ వృత్తిలో ఉన్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైపోయి, వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ 6 వ తేదీన సాయంత్రం గాంధీ ఆస్పత్రిలో చేరాడు. అయితే 9 తారీకున ఉదయం 9 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండానే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులను విచారించినా అతడి జాడ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.శోభన్ 5.5 అడుగుల ఎత్తు, తెల్లటి వర్ణం, నలుపు కళ్లతో, తెల్లని జుట్టుతో ఉండేవాడని, చివరిసారిగా క్రీమ్ రంగు టీషర్ట్, నల్ల ట్రాక్ ప్యాంట్ ధరించి కనిపించాడని తెలిపారు.చిలకలగూడ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# ముగ్గురు పిల్లల నిబంధన వెంటనే ఎత్తివేయాలి

- **ప్రతి ఒక్కరికి అర్హులుగా వెంటనే ప్రకటించాలి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ అక్టోబర్ 13 ప్రతినిధి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేశారు. మన రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రంలో వెంటనే ముగ్గురు పిల్లల నిబంధన వెంటనే ఎత్తివేయాలి టిఆర్ఎస్ నాయకులు నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు చేసి ఇద్దరి కంటే పిల్లలు ఉన్న వారు ప్రతి ఒక్కరికి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత వెంటనే కల్పించాలి. ఆంధ్రప్రదేశ్ లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించారని ఆయన గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులే అని ప్రకటించాలని ఆయన కోరారు



# గాంధీ మెడికల్ కాలేజీలో ఫెస్ట్–2025 ప్రారంభం

- **ఫ్యాకల్టీ, పీజీల మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్**

**సికింద్రాబాద్, అక్టోబర్ 13 ( సిద్దిపేట పవర్ ) :**

సికింద్రాబాద్‌గాంధీ మెడికల్‌కాలేజీ ఫెస్ట్ సోమవారం మెడికల్ స్టూడెట్స్ సందడి మధ్య ప్రారంభమైంది. వైద్యసేవలతో బిజీగా ఉండే వైద్యవిద్యార్థులు, అధ్యాపకులకు ఆట విడుపు దొరకడంతో కాలేజీ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఫెస్ట్ లో భాగంగా ఫ్యాకల్టీ, పీజీల జట్ల మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్ హోరాహోరిగా జరిగింది. డాక్టర్‌రాంబాబు కెప్టెన్సీలో ముందుగా బ్యాటింగ్‌చేసిన ఫ్యాకల్టీ జట్టు 8 వికెట్లకు 151 పరుగులు చేసింది. మురళీకృష్ణ, సందీప్‌రాజ్, కిరణ్, వంశీకృష్ణల బ్యాటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చారు. అనంతరం పీజీల జట్టు కేవలం 18 ఓవర్లలోనే టార్గెట్‌ను చేధించి విజయం సాధించారు. ఇటువంటి పోటీలు వైద్యులు, వైద్యవిద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఉత్సాహాన్ని నింపుతాయని గాంధీ మెడికల్‌కాలేజీ ప్రిన్సిపాల్‌ప్రొఫెసర్‌ఇందిర, సూపరింటెండెంట్‌ప్రొఫెసర్‌వాణిలు అన్నారు. 2కే21బ్యాచ్‌ఆధ్వర్యంలో కాలేజీ ఫెస్ట్‌ఈనెల 18వ తేది వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.




# బీసీ సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా బంద్

**సిద్దిపేట, అక్టోబర్ 13. న్యూస్.**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాని బంద్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంకటి నవీన్ గౌడ్,దళిత ఐకాస అధ్యక్షుడు బత్తుల చంద్రం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభు,యూత్ ప్రెసిడెంట్ పవన్, మార్కభార్గవ మాట్లాడుతూ బీసీలకు దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్ అమల అయ్యే వరకు ఈ పోరాటం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. మేము శాంతియుతంగా వ్యాపార సంస్థలు స్కూల్ యాజమాన్యాలకు,పిలుపునిచ్చి మరి బంద్ చేసాము కానీ కొందరు ఓర్వలేక ఇబ్బందులకు గురి చేశారు. అయినప్పటికీ బెదరకుండా మేము మా యొక్క బందును విజయవంతం చేసాము. మళ్ళీ 18 తారీకు రాష్ట్రవ్యాప్తంగా జరిగేటువంటి బందుకు ఈ సందర్భంగా పిలుపునిస్తున్న ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా తెలుపుతున్నాం. సిద్దిపేట జిల్లా బందు కు సహకరించినటువంటి వ్యాపారస్తులు,విద్యాసంస్థలు అన్ని సంఘాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్ , బైరి శంకర్, కాముని నగేష్, గట్టు నరసింహులు, ఆకుల ప్రశాంత్ బసంగారి వెంకట్ , శ్రీనివాస్, తిరుపతి,నెమలి సుభాష్,పడిగే ప్రశాంత్, రాజేష్,మహేష్ గౌడ్,వంశీ, బీసీ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.





# బోనస్ అన్ని వడ్లకు ఇవ్వాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- కొమురవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ సెంటర్ లు ప్రారంభం

**కొమురవెల్లి, అక్టోబర్ 13 (సిద్దిపేట పవర్)**

కొమురవెల్లి మండలంలోని అయినాపూర్,కిష్టంపేట,కొమురవెల్లి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు..ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే బోనస్ లు ఇస్తుంది అని అలా కాకుండా అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..అలాగే వడ్ల కొనుగోలు కేంద్రాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి అని సూచించారు..కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గీస బిక్షపతి, మాజీ ఎంపీపీ తలారి కీర్తన కిషన్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, ఏర్పుల మహేష్ బి.ఆర్.ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

---

## ఘనంగా డిగ్రీ పూర్వ విద్యార్థుల
# ఆత్మీయ సమ్మేళనం



- అనుభవాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు

**సిద్దిపేట అక్టోబర్ 13**

సిద్ది పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004 2007 బ్యాచ్ కు చెందిన సైన్స్ లో డిగ్రీ పూర్తి చేసిన పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. పట్టణం లోని స్థానిక ఎస్ఎస్ఆర్ బంకెట్ హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతి మాత చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం తమతో పాటు కలిసి చదువుకున్న వారిలో మరణించిన ముగ్గురు స్నేహితులు అంబటి లింగం గౌడ్, విజయకుమార్, సూర్య ప్రకాష్ లకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. తదనంతరం విద్యార్థులు ఒకరినొకరు తమ జీవిత అనుభవాలను, కాలేజీలో ఆనాడు చదువున్న నాటి జ్ఞాపకాలను వేదిక మీద నుంచి పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ, తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా కలిసి తమలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన, అందరూ అండగా ఉండి సహాయ సహకారాలు అందించుకోవాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమతో చదువున్న స్నేహితులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. చివర్లో కేక్ కట్ చేసి ఒకరినోకరు ఆత్మీయతను పంచుకున్నారు.






# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే కనువిప్పు

- గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం
- రాష్ట్రంలోని బస్తీ దవాఖానాలకు సుస్తీ
- కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్
- మాజీ మంత్రి హరీశ్ రావు
- కేటీఆర్‌తో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం



**హైదరాబాద్, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్‌లోని ఎస్‌పీఆర్ గ్రాండ్‌లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, సబితాఇంద్రారెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముఖ్యమైనదని, యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని హామీలు ఇచ్చిందని, బాండ్ పేపర్లు కూడా రాసి ఇచ్చిందని, 700 రోజులు దాటినా ఇంకా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఉద్యోగాలు, పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని, ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని, ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదని, మందులు కూడా అందుబాటులో లేవని మండిపడ్డారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిల్లులు వసూలు చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్ వస్తదని, అలా రావొద్దు అంటే బీఆర్ఎస్ గెలవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి ఇవ్వకుండా దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. హిందు, ముస్లింలంతా కలిసి హైదరాబాద్‌ను, తెలంగాణను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని, జూబ్లీహిల్ సీటును గెలిపించి అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

### మన రక్తంలోనే పోరాటం ఉంది

**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



'మన రక్తంలోనే పోరాటం ఉంది.. మొక్కవోని ధైర్యంతో ఉన్నాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మీ కసి, పట్టుదల, తపన బీఆర్ఎస్ విజయానికి నాంది కావాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసపోయిన ప్రతి ఒక్కరినీ కలిసి బాకీ కార్డులు పంచాలని క్యాడర్‌కు సూచించారు. 2 లక్షల ఉద్యోగాల్లో కనీసం 5 శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. ఆటో డ్రైవర్లు మొదలుకొని బస్ డ్రైవర్ల అందరి చూపూ జూబ్లీహిల్స్ వైపే చూస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డులు పెడతామని ఇంతవరకూ అతీగతీ లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇల్లు కూలగొట్టడమా? అని నిలదీశారు.





# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవు..

- బద్దిపడగా ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట పవర్ నంగునూరు అక్టోబర్ 13 :**

నంగునూర్ మండలం బద్దిపడగ గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా పరిశీలించారు. పప్పు బెండకాయ తో సాంబారు , గుడ్డు మాత్రమే వండారని కామన్ డైట్ మెనూ లో భాగంగా ఇంకో కూర వండలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజన ఉద్దేశం అని తెలిపారు. వంట సరుకులు, చేసిన కూర పర్యవేక్షణ భవనం పైనుండి నీరు కారుతున్నా పట్టించుకోవట్లేదని ప్రిన్సిపల్ పద్మ పైన ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల్లో ఇంత నిర్లక్ష్యంగా ఉన్నందుకు గాను కఠిన చర్యలు తీసుకోవాలని డిఈఓ కీ ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థుల తో రోజు ఆహారం మంచిగా పెడుతున్నారనీ ఆరా తీశారు. విద్యార్థులకు వడ్డించే ప్రక్రియను పరిశీలిస్తూ అన్నం సాంబారు సరిపడినంత పెట్టుకోవాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఆహారం సరిపడినంత తినాలని పారవేయకూడదని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తింటూ విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించారు. బాగా తినాలని తింటేనే చదువుకోడానికి శక్తి వస్తుందని జీవితం లో ఒక లక్ష్యం పెట్టుకోని చదవాలని మంచి క్రమశిక్షణ అలవాట్లతో



ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని కూరల్లో రుచి మెరుగుపరచాలని వంట సిబ్బందిని హెచ్చరించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని లేనిపెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.